దారపురెడ్డి కనకమహాలక్ష్మి
తెలుగు అధ్యాపకురాలు
శ్రీమతి వెలగపూడి దుర్గాంబ
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
నిడదవోలు.
చరవాణి : 9959327185
kanaka84maha@gmail.com

# ఆత్రేయ నాటికలు - పరిశీలన

మనసులోని భావాలను అత్యంత ప్రతిభావంతంగా అక్షరబద్ధం చేసిన మనసుకవి ఆత్రేయ. తన రచనల ద్వారా సమాజంలో నిత్యం జరిగే సంఘటనలను గూర్చి మనం ఆలోచనలోపడే విధంగా రచనలు చేసారు. మదిలోని భావాలను మధురమైన గేయాలుగా ఆవిష్కరించి మనసు కవి అయ్యారు. వారి రచనలలో మూడు నాటికలను పరిశీలిద్దాం.

విషప్రయోగం నాటికలో అయ్యగారు అని పిలువబడే పాత్ర కార్మికుల కష్టాన్ని దోపిడీ చేయడం, పానకాలు గా పిలవబడే మేస్త్రి ఆ అయ్యగారు చేస్తున్న దోపిడీని నివారించాలంటే అతడిని చంపడం ఒక్కటే మార్గమని, అతను తాగే మంచినీటిలో విషం కలుపుతాడు. నౌకరుగా పనిచేసే అప్పలస్వామితో ఈ రోజు నుండి మన కష్టాలు తీరిపోతాయని చెప్పి అధికారి కూర్చునే కుర్చీలో కూర్చుంటాడు. గుమాస్తా వచ్చి మంచినీరు తాగబోతుంటే వద్దని గ్లాసు విసిరికొడతాడు.

అధికారి రాగానే నా కుర్చీలో ఎందుకు కుర్చున్నావని కోప్పడితే ఇక్కడ పనిచేసే వాళ్ళలో హెచ్చు తగ్గులుండటానికి వీల్లేదు అని, కోటేశ్వరరావు అనే వ్యక్తి దగ్గరకు పని చేయడానికి వెళ్తాననీ లేదా లాభాలలో ఆరణాలు భాగం కావాలని అక్కడ పనిచేసే వాళ్ళకి కూడా లాభాల్లో  వాటా ఇవ్వాలని అంటాడు. వేరే గత్యంతరం లేక యజమాని ఒప్పుకునే సమయంలో అక్కడకు మఠాధిపతి అయిన బాబాజీగారు వచ్చి, పానకాలుతో నీకు న్యాయం జరిగేలా నేను చూస్తానని చెప్పి, పానకాలుని బయటకు పంపించి అయ్యగారితో లాలూచీ పడతాడు.

బయటకు వచ్చి కోటేశ్వరరావు చనిపోయాడని చెప్పి, ఈ విషయం మీ అయ్యగారికి తెలియదు కాబట్టి నువ్వు మీ అయ్యగారు చెప్పినట్లు నడుచుకో అంటాడు. ఆ మాట విన్న పానకాలు వేరే గత్యంతరం లేక సరే నంటాడు. ఈలోపు బాబాజీ మంచినీరడిగితే తేవడానికి వెళతాడు. వచ్చి చూసేసరికి బాబాజీ అక్కడి కూజాలోని మంచినీరు తాగి వెళ్ళిపోయాడని తెలుసుకుని దానిలో విషం కలిపిన సంగతి అప్పలస్వామికి చెప్పగా, తాను ఉదయం రాగేనే కూజాలోని నీళ్లు పారబోసి, వేరే పెట్టాననీ, ఆ బాబాజీ కోటేశ్వరరావుతో మాట్లాడటానకి వెళ్ళాడని తెసుకోవడంతో నాటిక ముగుస్తుంది.

దరఖాస్తు ఫారం నాటికలో బాగా బతికి ఇప్పుడిప్పుడే చితికిపోతున్న సంసారి ఆదిశేషయ్య గారి భార్య సీతారామమ్మ. వీరిది బ్రాహ్మణ కుంటుంబం సీతారామమ్మ చాలా ఆచార, సాంప్రదాయాలు గల వ్యక్తి. మడిగట్టుకుని మాత్రమే ఒడ్లు దంచే స్వభావం గల పాత్ర. కాఫీ పేకెట్టు పట్టుకుంటేనే అపచారం అయ్యిందని, మళ్ళీ తలస్నానం చేసే వ్యక్తి. ఈమె ఒక్కగానొక్క కొడుకు రాజు ఇతణ్ణి పట్నంలో చదివించినా ఉద్యోగం మాత్రం చేయకూడదని తన మీద ఒట్టు వేయించుకుంటుంది సీతారామమ్మ.

అందరి చేతా చిన్నమ్మ అని పిలవబడే పాత్ర పేరు విశాలాక్షి. ఈమె సీతారామమ్మకి మేనకోడలు. తన కోడలిగా చేసుకోవాలనుకుంటుంది. సీతారామమ్మ. తన అత్తయ్య అతిగా పాటించే ఆచారాలను ఎదిరించే నేటి కాలపు మనోభావాలు గల అమ్మాయి. ఈమె కూడా పట్నంలో చదువుకుంటుంది. ఇక రాజు తన తల్లి మాట కాదనలేక పట్నంలో ఉద్యోగం చేయనని మాట ఇస్తాడు.

రాజు తెప్పించుకున్న దరఖాస్తు ఫారం విశాలాక్షి తాను రాజు భార్యనని దరఖాస్తులో నింపి పంపగా కాలేజీలో ఉద్యోగం వచ్చినట్లు ఉత్తరం వస్తుంది. అది తెలుసుకున్న సీతారామమ్మ ఇదేమిటే నువ్వు ఉద్యోగం చేస్తావా? అంటే అవునని ధైర్యంగా చెబుతుంది. రాజు కూడా ఆమెను తీసుకుని ముందు మనం రిజిష్టరు ఆఫీసుకు వెళ్ళాలి అనడంతో నాటిక ముగుస్తుంది.

"అక్కయ్యకి ప్రమోషన్" నాటికలో ప్రధాన పాత్ర సుందరమ్మ. ఈవిడి పెళ్లైన 3 సం॥ల తర్వాత అత్తింటి నుండి పుట్టింటికి వస్తుంది. తన అత్తగారింటిలో ఆమె ఆడపడుచు, అత్తలు పెట్టే బాధలను తన పుట్టింటికి వచ్చినపుడు ఆడపడుచు హోదా చూపిస్తూ, తన వదిన గారిని బాధ పెట్టాలని అనుకునే మనస్తత్వం గలది. తల్లి తనను వెనకేసుకు రావటంలేదని. తల్లిని నిష్ఠూరాలాడుతుంది. తన చెల్లెలు సరోజ కూడా అక్కకు సర్దిచెప్పాలను కుంటుంది. తన భర్తకు ప్రమోషన్ వస్తే వేరు కాపురం పెడదామనుకుంటుంది.

రత్తమ్మ పాత్ర తన కోడలిని బాధ పెట్టాలను కుంటే ఇక్కడ వుండనవసరం లేదని కూతురితో చెబుతుంది. తన అత్త, ఆడబడుచుల ద్వారా పడిన అవమానాలు, బాధలు నా కోడలు పడకూడదనుకునే మంచి వ్యక్తి. ఇక సుశీలను సాధించాలి అనే ఉద్దేశ్యంతోనే నాటికి మొదలవుతుంది. కాబట్టి సుశీల ప్రధాన పాత్ర అనే చెప్పుకోవాలి. సుశీల తన సంసారాన్ని చక్కగా నడిపించే పాత్రగా కనిపిస్తుంది.

అన్నయ్య పాత్ర ఈ కుటుంబం నడవడానికి ఆధారమని సుందరమ్మ, సరోజల మాటల ద్వారా మనకు తెలుస్తుంది. తమ వదినను బాధపెడితే తమ అన్నయ్యకు చెప్పి వేరు కాపురం పెడుతుందని, నష్టపోయేది మనమే" అన్న మాటలను బట్టి వారి తండ్రి చనిపోయిన తరువాత కుటుంబాన్ని పోషించే బాధ్యత తీసుకున్నాడని అవగతమవుతుంది.

ఈ నాటికలలో సమకాలీన సమాజం మన కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. యజమానులు తమ దగ్గర పనిచేసే కూలీల కష్టాన్ని దోచుకోవడం, వారు ఎదిరిస్తే ఏదో ఒక రకంగా అణచివేయాలనుకోవడం నేటికీ సాగుతున్నదే అని చెప్పవచ్చు

అలాగే ధరఖాస్తు ఫారంలో మనకు పాతకాలం నాటి సాంప్రదాయాలు, ఆచారాలు, వారి ఆలోచనలు ఏమిటి అనేవి స్పష్టంగా తెలుస్తాయి. అదేవిధంగా విశాలాక్షి పాత్రలో ముందుచూపు, నేటి కాలపు యువతికి వుండవలసిన ధైర్యం కనిపిస్తాయి. రాజు యొక్క మనోభావాలు కూడా మారుతున్న యువకుల తీరుకు అద్దం పడతాయి. దీనిలో ముఖ్యంగా స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం వుంటే ఆమే కాకుండా ఆమె కుటుంబం కూడా సంతోషంగా వుంటుందనే సందేశం అంతర్లీనంగా కనిపిస్తుంది.

అక్కయ్య ప్రమోషన్ నాటికలో ఆడవారికి ఆడవారే శత్రువులు అన్న సామెత నిజమేమో అనిపిస్తుంది. సరోజ పాత్ర ద్వారా చదువు యొక్క గొప్పదనం గురించి, రత్తమ్మ పాత్ర ద్వారా తను పడిన కష్టాలు తన కోడలు పడకూడదనే పరిపక్వత, అనుభవం గల మనస్తత్వాన్ని చిత్రీకరించారు.

సుందరమ్మ చదువుకోక పోవడం, చిన్న తనంతో తనుపడే బాధలు వదినను పెట్టాలను కోవడం, తనకు తోడికోడలుగా వచ్చే వారిపై అధికారం చూపించాలనే మనస్తత్వం కనబడుతుంది. తన మరిది పెళ్లి చెడిపోయిందని తెలిసి పెద్దకోడలి ప్రమోషన్ పోయిందని బాధపడేటంతలో తన భర్తకు ప్రమోషన్ వచ్చిందని తెలియడంతో ఆమెకే ప్రమోషన్ వచ్చినంతగా సంబరపడడం మనకు గోచరిస్తుంది. ఏది ఏమైనా ఈ నాటికలలో మనకు స్త్రీ మనోభావాలు, స్త్రీ విద్య, స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలనే ఆలోచనలు అన్నీ కలసి మనకు ఆరుద్రగారు అందించారనిపిస్తుంది. నేటి సమాజంలో కూడా ఇవన్నీ మనకు నిత్యం ఎదురయ్యే అనుభవాలుగానే ఉన్నాయి. వీటన్నిటికీ మన మానసిక ఆలోచనలలో మార్పు రావటమే పరిష్కారమని భావించవచ్చు.